పబ్లిక్ టాయిలెట్స్ లేక తిప్పలు

- నిధులున్నా ప్రారంభం కాని పనులు
- ఎల్లారెడ్డిపేట, వెంకటాపూర్‌లో నిత్యం ప్రజల ఇబ్బంది



ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంతో పాటు వెంకటాపూర్‌లో పబ్లిక్ టాయిలెట్స్ లేక ప్రయాణికులు, గ్రామీణులు, ఇబ్బంది పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు. అత్యవసరమైతే మండలకేంద్రంలోని గిద్ద చెరువు కట్ట, లేదంటే దుమాల శివారు చిట్టి వాగు వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి. ఎల్లారెడ్డిపేట జనాభా సుమారు 10,500 కాగా మండలకేంద్రానికి చుట్టూ సుమారు 15 గ్రామాలతో పాటు వీర్నపల్లి మండలం నుంచి నిత్యం పదివేల మంది వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్తుంటారు. గంటల తరబడి పనులకోసం నిరీక్షిస్తున్న సమయంలో అందుబాటులో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు. వెంకటాపూర్ జనాభా 4041 కాగా, ఎక్కువగా వ్యాపారలావాదేవీలు జరుగుతాయి. సమీప గ్రామాలైన పోతిరెడ్డిపల్లి, అగ్రహారం, ముస్తాబాద్ మండలం ఆవునూరు, గూడెం, కొండాపూర్, రామ్‌రెడ్డిపల్లె తదితర గ్రామాల నుంచి రోజూ వెయ్యిమంది వరకు అయాపనుల నిమిత్తం వచ్చి వెళ్తుంటారు. ఈ రెండు గ్రామాలు మేజర్ పంచాయతీలు అయినా పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణాలను పట్టించుకోవడం లేదు. రెండు గ్రామాల్లో కలిపి రూ.14లక్షలు వెచ్చిస్తే అధునాతన పద్ధతిలో పబ్లిక్ టాయిలెట్స్ అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. పంచాయతీరాజ్, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ అధికారుల మధ్య సమన్వయ లోపం వల్లే మూత్రశాల ఏర్పాటులో నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

నిధులున్నా.. పనులు సున్నా..

నిధులున్నా ప్రజలకు ఉపయోగపడే పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఎల్లారెడ్డిపేటలో మాడ్రన్ టాయిలెట్స్ ఏర్పాటు చేసేందుకు రూ.7లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనాలు తయారు చేశారు. అందుకు అనుగుణంగా గ్రామ పంచాయతీ నుంచి నిధులు కేటాయించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. అయితే పంచాయతీరాజ్ శాఖ అధికారుల నుంచి డిజైనింగ్‌తో పాటు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో పనులు చేపట్టడం లేదు. అప్పటి జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ ప్రత్యేక చొరవతో రాచర్ల గొల్లపల్లిలో రూ.7లక్షలతో మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. అదే తరహాలో ఎల్లారెడ్డిపేట, వెంకటాపూర్‌లలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. నిధులు పుష్కలంగా ఉన్నా పనుల్లో నిర్లక్ష్యం చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామపంచాయతీల పరిధిలో రాచర్ల గొల్లపల్లి, ముస్తాబాద్‌లో తప్ప ఎక్కడ మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామ పంచాయతీల పరిధిలో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక దుకాణాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు నిర్మించలేదు. అందుబాటులో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించి ఇబ్బందులను తొలగించాలి.

– సత్యం, వ్యాపారి, ఎల్లారెడ్డిపేట

పనులు చేపడుతాం



పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు కోసం నిధులు కేటాయించాం. అధికారులు డిజైనింగ్ పంపిన వెంటనే పనులు చేపడతాం. రూ.7లక్షలతో మోడ్రన్ టాయిలెట్లు నిర్మించాలని నిర్ణయించాం. త్వరలోనే పనులు చేపడుతాం.

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని జగదాంబ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని మండపం ఏర్పాటుకు సోమవారం ఎంపీపీ పడిగెల మానస శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అంకారపు లక్ష్మీ, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎడమల బాల్‌రెడ్డి, యువజన సంఘం అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్, ఆంజనేయులు, మచ్చ రామకృష్ణ, అంకారపు మహేశ్, సాయికృష్ణ, అనిల్, పూజారి కోడం వెంకటేశం, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన మిరాల చంద్రకళకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.60వేల విలువైన చెక్కును బీఆర్‌ఎస్ సీనియర్ యువజన నాయకుడు మాచర్ల హరీశ్ సోమవారం అందజేశారు. ఇక్కడ సర్పంచ్ రజిత, లింబాద్రి, రాచర్ల రాజు, ఎల్లయ్య, రాములు, పర్శరాములు, సురేశ్, నర్సయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

వీర్నపల్లి: మండలంలోని బాబాయ్ చెరువు, లాల్‌సింగ్ తండా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం గ్రామసభలు సోమవారం సర్పంచ్‌లు భూక్య లక్ష్మీ, ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు మాట్లాడుతూ.. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై సభలో చర్చించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బొల్లారం కృష్ణ, జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మీరా రాజు, ఉపసర్పంచ్ రాములు గ్రామపెద్దలు, ఉపాధిహామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్స్ అందజేత

కోనరావుపేట: మండలంలోని పలుగ్రామాల్లో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్, బీసీబంధు చెక్కులు అందజేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. అన్ని గ్రామాలకు చెందిన 172 మందికి ప్రొసీడింగ్స్ అందించామన్నారు. 37 మందికి బీసీబంధు చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

షూటింగ్ సందడి



షూటింగ్ ప్రారంభోత్సవంలో నటీనటులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని భీముని మల్లారెడ్డిపేటలో సోమవారం షూటింగ్ సందడి ప్రారంభమైంది. గ్రామ సమీపంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో ఓ ప్రైవేట్ అల్బమ్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఎంటి ట్యూన్స్ ఆధ్వర్యంలో 'వెళ్లిపోకే రాములా' లవ్ ఫెయిల్యూర్ సాంగ్‌ను చిత్రీకరిస్తున్నారు. కార్యక్రమంలో నిర్మాత మోహన్, నటీనటులు అర్జున్, వన్య అగర్వాల్, డైరెక్టర్ మున్నా, సర్పంచ్ శెట్టి మహేశ్వరి, ఎంపీటీసీ రాజేందర్, ఆలయ కమిటీ చైర్మన్ మణిదీప్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రవి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం, ఆరెపల్లి గ్రామాల్లో జెడ్పీటీసీ మ్యాకల రవి బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. సర్పంచుల కొండపల్లి వెంకటరమణారావు, ఇటుకల నవీనరాజు, ఎంపీటీసీ బస రాజశేఖర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, మేర్గు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి తొమ్మిదో వార్డు సర్దాపూర్, పెద్దూరులో మహిళలకు సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసమే ప్రభుత్వం కానుకగా బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తుందన్నారు. కౌన్సిలర్ సత్యనారాయణ, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు రాములు, వార్డు అధ్యక్షుడు షేక్ అలీ, తదితరులున్నారు.

బోరు మోటార్ బిగింపు

వేములవాడరూరల్: మండలంలోని మర్రిపల్లి గౌడ కులస్తులకు ఎంపీపీ బండ మల్లేశం బోరు మోటార్‌ను మంజూరు చేశారు. గతంలో బోరు ఉండగా దానికి నూతనంగా రూ.లక్షతో మోటార్ బిగించారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలుమ బాల్‌రెడ్డి, గౌడసంఘం అధ్యక్షుడు వెంకటేశం, సర్పంచ్ కట్కం మల్లేశం, కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ చూసి ఓర్వలేకే అసత్య ఆరోపణలు



ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారని ఆపార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. పోతుగల్‌లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అన్నివర్గాల ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తలారి నర్సింలు, రాంరెడ్డి, అంజనేయులు, అనమేని రాజు, బాబు, చంద్రమౌళి, రాజయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండంలోని పలు గ్రామాల్లో సోమవారం గడపగడపకూ కాంగ్రెస్ గ్యారంటీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ.. సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను పార్టీ అధికారంలోకి రాగానే అమలుచేస్తామని తెలిపారు. కుటుంబ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గంట బుచ్చా గౌడ్, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందించండి



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన విద్యార్థిని సమ్రీన్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతుంది. వికలాంగురాలైన సమ్రీన్‌కు నిత్యం స్కూల్‌కు వెళ్లి రావడం కష్టంగా మారింది. ఆటోలో పంపేందుకు నెలకు రూ.వెయ్యి వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజ్‌యాదవ్ సదరు విద్యార్థిని తీసుకొని జిల్లా సంక్షేమాధికారిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ పరిస్థితుల్లో సదరు విద్యార్థి ఉన్నత చదువులను దృష్టిలో పెట్టుకొని ట్రై సైకిల్ అందించాలని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా వెల్ఫేర్ అధికారి లక్ష్మీరాజ్యంకు విన్నవించారు.

పట్టర పట్టు హైలెస్సా..



స్టేజీని మోసుకెళ్తున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి: సాధారణంగా టేబుళ్లు, టేలా డబ్బాలను మోసుకెళ్లడం చూస్తుంటాం.. కానీ అందుకు భిన్నంగా సోమవారం వినాయక మండపం కోసం నిర్మించిన భారీ స్టేజీని మోసుకెళ్లారు గోపాల్‌రావుపల్లె గ్రామస్తులు. మండలంలోని గోపాల్‌రావుపల్లెలో వినాయక చవితి సందర్భంగా భారీ స్టేజీని ఇనుప పైపులతో ఏర్పాటు చేశారు. దుర్గామాత నవరాత్రులు ప్రారంభం కానుండగా నెలకొల్పేందుకు వేరే ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవడంతో ఏకంగా స్టేజ్ మొత్తాన్ని చేతులతో ఎత్తుకొని తీసుకెళ్లారు.

రైతుల సంక్షేమానికే సహకార సంఘాలు



వేములవాడఅర్బన్: వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి పది మంది రైతులకు దీర్ఘకాలిక రుణాల చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు పనిచేస్తున్నట్లు తెలిపారు. రైతులకు రూ.42 లక్షల చెక్కులను అందజేశామన్నారు. రైతులు తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

✦ పంచాయతీ భవనానికి భూమిపూజ

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్‌తో కలిసి సర్పంచ్ బూర్గుల నందయ్య సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగయ్య, ఉపసర్పంచ్ మేడిద మల్లయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొండయ్య, ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి..

కోరెంలో రూ. 8 లక్షల అంచనాలతో కొండ పోచమ్మ ఆలయానికి వెళ్లే సీసీరోడ్డు నిర్మాణానికి సోమవారం ఎంపీటీసీ డబ్బు మమత భూమిపూజ చేశారు. ఆలయానికి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారిందని మండల కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు ఇటీవల ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరుచేసినట్లు తెలిపారు. మధ్యలో కల్వర్టు నిర్మాణానికి ఎంపీపీ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గాజర్ల రోహిణి, నాయకులు డబ్బు సృజన్‌రెడ్డి, గాజర్ల కిరణ్, తదితరులు ఉన్నారు.

✦ పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లఅర్బన్: ఈనెల 31, నవంబర్ 1న నిర్వహించే ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం పట్టణంలో నాయకులు ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి దశరథం, రాష్ట్ర కమిటీ సభ్యుడు వల్లాల కిషోర్, తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకుడు రవీందర్, తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ముస్తాబాద్: ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధులతో మండలంలోని పోతుగల్‌లో హైమాస్ట్ లైట్లను శ్రీశివకేశవుల ఆలయాల వద్ద ఏర్పాటు చేశారు. రూ.4లక్షల వ్యయంతో నిర్మించిన హైమాస్ట్ లైట్లను ఆలయాలతోపాటు ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసినట్లు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కోల కృష్ణ తెలిపారు. సర్పంచ్ గౌతంరావు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వెంకటేశ్, మహిపాల్, రాజు, ఆది శేఖర్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

సిరిసిల్లఅర్బన్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధి తొమ్మిదో వార్డులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ భూమిపూజ చేశారు. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు రూ.2కోట్ల 30 లక్షలతో అదనపు తరగతి గదులు, ల్యాబ్, తదితర నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, డీఈవో రమేశ్‌కుమార్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

తప్పిపోయిన వృద్ధురాలు వృద్ధాశ్రమానికి తరలింపు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో తప్పిపోయిన వృద్ధురాలిని తంగళ్లపల్లి మండలం మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమానికి తరలించారు. జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం మాట్లాడుతూ సుమారు 65 నుంచి 70 ఏళ్ల వయస్సున్న భాగ్యవ్వ అనే వృద్ధురాలు సరిగా వివరాలు తెలపడం లేదని తెలిసిన వారెవరైనా ఉంటే వృద్ధాశ్రమంలోకి వచ్చి తీసుకెళ్లాలన్నారు.

సన్మానం

కోనరావుపేట: మండలంలోని మంగళ్లపల్లికి చెందిన ఉప్పుల జీవరత్నం–పద్మ కుమారుడు హిజికియా కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం సర్పంచ్ సంతోష్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

కోనరావుపేట: ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన నిమ్మపల్లికి చెందిన రాపెల్లి సాగర్‌ను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంతరవేని శ్రీనివాస్‌గౌడ్, లైవ్ జిల్లా అధ్యక్షుడు భానోత్ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

బొడ్డెమ్మ సంబరాలు



సిరిసిల్ల జిల్లాకేంద్రంలో బొడ్డెమ్మ సంబరాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చిన్నారులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని ఆడిపాడారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

పంటల పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని విలాసాగర్‌లో రైతుల వరి, పత్తి పంటలను వ్యవసాయ పరిశోధనాస్థానం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సోమవారం సందర్శించారు. వరిలో మొగిపురుగు, కంకినల్లి, పత్తిలో రసం పీల్చే పురుగులను గమనించి పిచికారీ చేయాల్సిన నివారణ మందులను రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనాస్థానం కరీంనగర్ శాస్త్రవేత్తలు ఏ. విజయభాస్కర్, జి. ఉషారాణి, పి. మధూకర్‌రావు, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ కే. మదన్‌మోహన్ రెడ్డి, ఏఈవో రజిత గ్రామ రైతులు పాల్గొన్నారు.

పోచెట్టిపల్లిని పంచాయతీగా ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే రమేశ్‌బాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నాగాయపల్లి పరిధిలో ఉన్న పోచెట్టిపల్లిని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని పోచెట్టిపల్లి, నాగాయపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు విన్నవించారు. కొన్నేళ్లుగా రెండు పల్లెలకు ఒకే గ్రామ పంచాయతీ ఉండడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని, జనాభా ప్రాతిపాదికన ప్రత్యేక గ్రామ పంచాయతీగా పోచెట్టిపల్లిని ఏర్పాటు చేయాలని వారు కోరారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఇందులో ఎంపీపీ బండ మల్లేశంయాదవ్, సర్పంచ్ టంపుల సుమన్, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

బీడీ కార్మికులందరికీ పింఛన్లు ఇవ్వాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న టేకేదారులు

ముస్తాబాద్: బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయాలని తెలంగాణ బీడీ టేకేదార్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బద్దెపూరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇప్పటికే ఆసరా పింఛన్లు ఇస్తోందని, 2014 అనంతరం పీఎఫ్ పొందిన కార్మికులకు, ప్యాకర్లకు, స్లీవర్స్, బట్టి కార్మికులకు, టేకేదార్లకు ఆసరా పింఛన్లు అందజేయాలన్నారు. ఏళ్ల తరబడి బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న వారందరికీ పీఎఫ్‌తో నిమిత్తం లేకుండా పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి రంగయ్య, శ్రీనివాస్, శంకర్, రాజు, వెంకటేశ్, తులసీదాస్, కిషన్, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే స్పోర్ట్స్‌కిట్లు



స్పోర్ట్స్‌కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

చందుర్తి : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను ప్రతి గ్రామపంచాయతీకి అందిస్తున్నట్లు ఎంపీపీ బైరగోని లావణ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని 19 గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు స్పోర్ట్స్ కిట్స్‌ను ఆయా గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు, యువతకు క్రీడలపై ఆసక్తి ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు లేక క్రీడలకు దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం కుమార్, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, చందుర్తి సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కో ఆప్షన్ బత్తుల కమలాకర్, వైస్‌ఎంపీపీ మందాల అబ్రహం, ఎంపీటీసీ మ్యాకల గణేశ్, సర్పంచ్‌లు లింగంపల్లి కరుణాకర్, అయిల్నేని కమలాకర్‌రావు, దుమ్ము అంజయ్య, దారం బాల్‌రెడ్డి, దేవస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న వైద్యుడు ప్రవీణ్‌కుమార్

వేములవాడఅర్బన్: విద్యార్థులు అన్ని సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని జిల్లా మానసిక వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఒత్తిడి, ఆందోళన, తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు. పరీక్షల భయం, ఒంటరి తనం, తదితర సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజగోపాల్, ప్రతాపరెడ్డి, రవికుమార్, ప్రభాకరాచారి, రాజేందర్ తదితరులు ఉన్నారు.

తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

రుద్రంగి: మండలంలోని వీరునితండాలో ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణానికి సోమవారం సర్పంచ్ గుగులోతు మేనా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన తండాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అయోమయంలో ఓటర్లు

- ఓటరు లిస్టుపై గోప్యత ఎందుకు..?
- ప్రజలకు సమాచారం అందించని వైనం
- తంగళ్లపల్లి అధికారుల తీరుపై విమర్శలు



తంగళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అసెంబ్లీ ఎన్నికలకు సోమవారం నుంచి నగారా మోగింది.. ఎన్నికల ఏర్పాట్లతోపాటు ప్రజలను చైతన్యవంతం చేస్తూ ఓటర్ లిస్టు, ఓటింగ్‌పై అవగాహన కల్పించాల్సిన మండల అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. పై అధికారుల వద్ద మాట రాకుండా పైపై పనులు చేస్తూ మమ అనిపిస్తున్నారు. ఓటర్లకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఇష్టానుసారంగా వ్యవహరించడం పట్ల ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల గురించి చేపట్టిన కార్యక్రమాలు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కనీసం మీడియాకు కూడా తెలపడం లేదు. దీంతో సమాచార లోపంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. చివరికి ఓటర్ లిస్టు గ్రామ పంచాయతీల్లో ప్రదర్శిస్తున్నామని చెప్పకుండా గుట్టుచప్పుడు కాకుండా పంచాయతీలకు తరలించారు. మండలం, గ్రామాల వారీగా ఓటర్ లిస్టులో ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఏ ఒక్క అధికారి ఫోన్ నంబర్ కూడా తెలిపిన దాఖలాలు లేవు. ఈ విషయంపై మండల అధికారులను వివరణ కోరగా అంతా తమకేం సంబంధం లేదని దాటవేస్తున్నారు. మండల అధికారులపై తీరుపై కలెక్టర్ స్పందించాల్సిన అవసరముంది.

యువకుడిపై దాడి

సిరిసిల్లఅర్బన్: పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన వడ్లూరి సుదర్శన్‌పై అదే నగర్‌కు చెందిన పలువురు యువకులు దాడి చేసినట్లు బాధితుడు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. డబ్బుల విషయంలో అంబేద్కర్ నగర్‌కు చెందిన ప్రశాంత్, అభిషేక్, విక్కీతో పాటు మరో ఇద్దరు యువకులు చిట్టి డబ్బులు ఎప్పుడు చెల్లిస్తావని బైక్‌పై వెళ్తున్న తనను దాడి చేశారని పేర్కొన్నాడు. తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సిరిసిల్లఅర్బన్: పట్టణంలో నెహ్రూనగర్‌కు చెందిన నేత కార్మికుడు రాపెల్లి శ్రీనివాస్ (48) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తంగళ్లపల్లి మండలానికి చెందిన శ్రీనివాస్ భార్యతో నెహ్రూనగర్‌లో ఉంటున్నాడు. తాగుడుకు బానిసై నిత్యం భార్యతో గొడవపడేవాడు. ఆదివారం మరోసారి భార్యతో గొడవపడి కొట్టడంతో తల్లిగారి ఇంటికి వెళ్లింది. సోమవారం ఇంటికిరాగా ఉరేసుకొని కనిపించాడు. పోలీసులు కేసునమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.